బొడ్రాయి

'బొడ్రాయి' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునా మాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

దారిచూపే నేతలతోనే వెలుగు

డాక్టర్ అవ్వాలి.. లేకపోతే ఇంజినీర్. ఎట్టి పరిస్థితుల్లోనూ జాబ్ కొట్టాలి. ఎవని కిందనో పని చేయాలి తప్ప.. మనం పది మందికి జాబ్ ఇవ్వాలన్న ఆలోచన లేదు. మనమెందుకు మన దుకాణం పెట్టొద్దు. మనమెందుకు మన ఎంటర్‌ప్రైజ్ పెట్టొద్దు. మనమెందుకు వరల్డ్ క్లాస్ ప్రొడక్ట్స్ తయారుచేయవద్దు. గూగుల్, ఫేస్‌బుక్, ట్విటర్.. అవేమన్న బ్రహ్మ పదార్థాలా? రాకెట్ సైన్సా? మనం కనిపెట్టలేమా. అప్పట్లో సరైన వసతులు లేవు.

కానీ ఇప్పుడు టీ హబ్, వీ హబ్, టీ వర్క్స్, టాస్క్.. అనేక ప్రభుత్వ ఇన్‌స్టిట్యూట్‌లు తెలంగాణలో ఉన్నాయి. మీ కోసం ప్రభుత్వం రెడిమేడ్ ప్లాట్‌ఫాం సిద్ధం చేసింది. పెట్టుబడులు పెట్టేవాళ్లను తీసుకొస్తాం. మెంటర్‌షిప్ ఇస్తాం. మీ కోసం అన్నీ చేస్తాం. అరటి పండు తెచ్చి మీ చేతిలో పెడతాం. ఒలిచి తినే బాధ్యత మీదే. ఆలోచనతో రండి.. ఉత్పత్తులతో వెళ్లండి.. ఎంటర్‌ప్రైజ్‌లు పెట్టండి. డోంట్ బీ ఏ జాబ్ సీకర్ బీ ఏ జాబ్ క్రియేటర్. - మంత్రి కేటీఆర్

సికింద్రాబాద్ రోడ్లపైన వ్యాపారాలు చేస్తుంటారు. అదే కూరగాయలు, ఇతర వస్తువులు అమ్ముతుంటారు. వాళ్లందర్నీ వేరే ప్రాంతానికి తరలిస్తాం. ఆ ప్రాంతంలో 24/7 కార్యకలాపాలు నడుస్తుంటాయి. బిజినెస్ జరుగుతుంది. ఇన్‌కమ్ పెరుగుతుంది. యువతకు ఉపాధి దొరుకుతుంది. తెలంగాణ యువతకు మూడు షిఫ్టుల్లో పని లభిస్తుంది. - టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

సమర్థ నాయకుడికి, అసమర్థ నాయకుడికి మధ్య తేడా ఇదే. యువతకు ఉపాధి కల్పనకు సంబంధించి ప్రశ్న ఎదురైనప్పుడు ఇద్దరు నేతలు స్పందించిన తీరులో స్పష్టంగా వ్యత్యాసం తెలుస్తున్నది. ఒకరేమో భవిష్యత్తుకు భరోసానిస్తూ.. విద్యార్థులు ఇన్నోవేటివ్‌గా ఆలోచించి నలుగురికి ఉపాధి కల్పించాలని చెప్తుంటే, ఇంకొకరేమో సరైన అవగాహన లేకుండా యువతకు భవిష్యత్తు అనేదే లేకుండా చేయాలని ఆలోచిస్తున్నారు. ఆ దిశగా పావులు కదుపుతున్నారు. వారే మన రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రిగా ప్రపంచ మేధావుల మన్ననలు పొందిన కేటీఆర్‌తో రేవంత్‌ను పోల్చడమే బుద్ధి తక్కువ. అయినప్పటికీ చెప్పాల్సిన సందర్భం వచ్చింది కాబట్టి యువతకు చెప్పక తప్పడం లేదు.

ఉపాధి కల్పనలో తెలంగాణ సర్కారు దేశంలోని అన్ని రాష్ర్టాల కంటే ముందంజలో ఉన్నది. 2014 నుంచి ఇప్పటివరకు ఏకంగా 2,32,308 ప్రభుత్వ ఉద్యోగాలకు ఆర్థికశాఖ అనుమతులు ఇచ్చింది. 2,02,735 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు వెలువడగా.. 1,60,083 మంది కొలువులు పొందారు. ఒక్క టీఎస్ఎల్‌పీఆర్‌పీబీ ఆధ్వర్యంలోనే ఈ పదేండ్లలో 50 వేల వరకు పోలీసు నియామకాలు జరిగాయి. టీఎస్‌పీఎస్సీ 35 వేలకు పైగా ఉద్యోగాలను భర్తీచేయగా, మరో 18 వేల వరకు కొలువులు భర్తీ దశలో ఉన్నాయి. ఉమ్మడి పాలనలో కాంగ్రెస్ హయాంలో 2004-2014 వరకు పదేండ్ల కాంగ్రెస్ ప్రభుత్వం 24,086 ఉద్యోగాలు మాత్రమే ఇచ్చింది. ఈ లెక్కన మన తెలంగాణ వాటా చూసుకుంటే సుమారు 10 వేలు మాత్రమే. అంటే ఏటా 1008 ఉద్యోగాలే. అదే సమయంలో తెలంగాణ ప్రభుత్వం ఏడాదికి 16,083 ఉద్యోగాలు ఇచ్చింది. ఇది కేసీఆర్ సర్కారుకు ఉన్న చిత్తశుద్ధి.

మన దేశంలో 140 కోట్ల జనాభా ఉండగా.. కేంద్ర ప్రభుత్వ కొలువులు సుమారు 40 లక్షలు మాత్రమే. అయితే ప్రస్తుతం 30 లక్షల మంది మాత్రమే కేంద్ర ఉద్యోగులుగా సేవలందిస్తున్నారు. సుమారు 10 లక్షల ఖాళీలున్నాయని స్వయంగా కేంద్ర

> ఉపాధికి ఊతమిస్తున్న సర్కారుకు అండగా నిలవాల్సిన బాధ్యత యువతపై ఉన్నది. ఈ సమయంలో యువత తప్పటడుగు వేస్తే రాష్ట్రం దశాబ్దాల వెనుకబాటుకు గురవుతుంది. మళ్లీ పైకి లేవాలంటే సంవత్సరాలు పడుతుంది. అందుకే యువత మేలుకో. రాష్ర్టాన్ని అభివృద్ధి దిశగా నడిపించే నాయకుడిని ఎన్నుకో.

ప్రభుత్వమే లోక్‌సభ సాక్షిగా సెలవిచ్చింది. దీన్నిబట్టి పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. అందుకే రాష్ట్ర ప్రభుత్వాలు ప్రైవేటు రంగానికి పెద్దపీట వేస్తుంటాయి. పరిశ్రమల రాకతో రాష్ట్ర ఖజానాకు ఆదాయం రావడంతో పాటు స్థానిక యువతకు ఉపాధి దొరుకుతుంది. ఈ విషయంలో మన రాష్ట్రం ఎంతో స్పష్టతతో ఉన్నది. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలో పరిశ్రమల రంగం దూసుకుపోతున్నది. మరీ ముఖ్యంగా ఐటీ రంగం జెట్‌స్పీడ్‌ను అందుకున్నది. సిలీకాన్‌వ్యాలీగా పేరొందిన బెంగళూరును మన హైదరాబాద్ దాటేసింది. తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన అనేక సంస్కరణలు, మంత్రి కేటీఆర్ కృషి ఫలితంగా అనేక అంతర్జాతీయ సంస్థలకు హైదరాబాద్ వేదికైంది. ఫార్చ్యూన్ 500 కంపెనీలు కొలువయ్యాయి. గ్లోబల్ కంపెనీలు గూగుల్, ఆపిల్, ఫేస్‌బుక్, అమెజాన్ తదితర సంస్థలు తమ క్యాంపస్‌లను ఇక్కడ ఏర్పాటుచేశాయి. భారీగా కొలువులు వచ్చాయి. గతేడాది దేశవ్యాప్తంగా 4.5 లక్షల ఐటీ ఉద్యోగాలు రాగా.. వారిలో 1.5 లక్షల మంది హైదరాబాద్ నుంచే ఉండటం గమనార్హం.

2014కు ముందు హైదరాబాద్‌లో 3.2 లక్షల ఐటీ ఉద్యోగులే ఉండగా.. ఈ పదేండ్లలో ఆ సంఖ్య భారీగా పెరిగింది. ప్రస్తుతం హైదరాబాద్ కేంద్రంగా 10 లక్షల మంది ఐటీ ఉద్యోగులు సేవలందిస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఐటీ ఎగుమతులు రూ.57 వేల కోట్లుండగా.. ప్రస్తుతం మన రాష్ట్ర ఐటీ ఎగుమతులు రూ.2.41 లక్షల కోట్లకు ఎగబాకాయి. 31 శాతం వృద్ధి రేటుతో తెలంగాణ ఐటీ రంగం దూసుకెళ్తున్నది. నల్లగొండ, ఖమ్మం, కరీంనగర్ తదితర జిల్లాలకు కూడా ఐటీ టవర్లు అందుబాటులోకి వచ్చాయి. అదే సమయంలో స్థానిక యువతకు చేయూతనందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం టాస్క్, టీ హబ్, వీ హబ్, టీ వర్క్స్ తదితర ఇన్‌స్టిట్యూట్‌లను నెలకొల్పింది. నైపుణ్య శిక్షణను అందిస్తున్నది. ఐటీతోపాటు ఇతర పరిశ్రమలకు తెలంగాణ కేంద్రంగా మారింది.

దండుమల్కాపూర్ ఇండస్ట్రియల్ పార్కు, సుల్తాన్‌పూర్‌లో మహిళా పారిశ్రామికవాడ, రాష్ట్రవ్యాప్తంగా పారిశ్రామిక వాడలను అందుబాటులోకి తెచ్చింది. తద్వారా యువతకు ప్రైవేటు రంగంలో ఉపాధి చూపుతున్నది.



మాలోతు సురేష్
98856 79876

నాడు రాముడు.. నేడు చంద్రుడు

దేశంలో ఎందరో పాలకులు వస్తుంటారు, పోతుంటారు. అందులో కొద్ది మందిని మాత్రమే ఈ చరిత్ర, సమాజం గుర్తుపెట్టుకుంటుంది. అలాంటి అతికొద్ది మంది నాయకుల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ ఒకరు. తెలంగాణ స్వరాష్ట్రం, హక్కుల కోసం ఎన్నో పోరాటాలు చేసి, కోట్లమంది ప్రజలను, విద్యార్థులను, యువతను, ఉద్యోగులను ఏకతాటి మీదకు తీసుకొచ్చి కేంద్రాన్ని ఒప్పించిన నాయకుడు కేసీఆర్. ఎన్నో త్యాగాల తర్వాత తెలంగాణ రాష్ర్టాన్ని సాధించుకున్నాం.

పోరాడి తెచ్చుకున్న తెలంగాణలో ప్రజల ఆశీర్వాదంతో రెండు సార్లు ముఖ్యమంత్రిగా ఎన్నికయ్యారు కేసీఆర్. తొమ్మిదేండ్ల పాలనలో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిన ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్. అలాంటి వ్యక్తిపై భారతదేశంలో 54 ఏండ్లు పరిపాలన చేసి అవినీతికి మారుపేరుగా నిలిచిన కాంగ్రెస్ పార్టీ నాయకులు తప్పుడు ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు.

నాటి కాంగ్రెస్ పాలకులు చేసిన తప్పుడు నిర్ణయాలతో దేశాభివృద్ధి నేడు కుంటుబడిపోయింది, ఒకనాడు మనతో సమాన జీడీపీ కలిగిన చైనా నేడు ప్రపంచ ప్రగతిలో రెండవ స్థానంలో ఉన్నది. వారి ఆర్థిక ప్రగతి మనతో పోల్చుకుంటే ఐదు రెట్లు అధికంగా ఉన్నది. దీనికి కారకులు కాంగ్రెస్ పాలకులు కాదా? ఇలాంటి వాటి మీద ఎలాంటి చర్చలు చేయకుండా కేవలం అభివృద్ధి చేసే నాయకులపై ఎదురుదాడులు చేస్తూ, మాకు మళ్లీ అధికారం ఇవ్వండి, దేశ రూపు రేఖలు మారుస్తామని మాయ మాటలు చెప్తున్నారు.

ఒక్క మాటలో కాంగ్రెస్ పాలన గురించి చెప్పాలంటే... కరువులు, కరెంటు కష్టాలు, స్కాములు, కమిషన్లు. కరెంటు, సాగు, తాగు నీళ్లు లేక తెలంగాణ ఎడారిని తలపించింది. కరువు నివారణ కోసం కేంద్రం నిధులు విడుదల చేస్తే ఆ పార్టీ నాయకులే సగం తినేవారు. మిగిలిన పైసలు రావాలంటే అధికారులకు లంచాలు ఇవ్వాల్సిందే. ఇలాంటి తప్పులను కాంగ్రెస్ పార్టీ కప్పిపుచ్చుకొని, అభివృద్ధికి ఆదర్శమైన టువంటి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను విమర్శించడం చూస్తుంటే ఆశ్చర్యమేస్తున్నది.

కేసీఆర్ ప్రభుత్వం వచ్చిన తర్వాత పల్లెల రూపురేఖలే మారిపోయాయి. గ్రామాలన్నీ తారురోడ్లు , ధాన్యపురాశులు, నిండిన చెరువులు, పచ్చని పైరులు, వృద్ధుల నవ్వులు తారసపడుతున్నాయి. విశాలమైన పాఠశాల భవనాలు దర్శనమిస్తున్నాయి. మాడల్ స్కూల్స్, గురుకులాలు, పౌష్టికాహారంతో కూడిన భోజనాలు కనిపిస్తున్నాయి. మందులు దొరకని ప్రభుత్వ దవాఖానల స్థానంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, పాత కలెక్టర్ భవంతులు పోయి అందమైన కలెక్టరేట్లు, ఎస్పీ కార్యాలయాలు ఇట్ల ఒక్కటా, రెండా ఎన్నో నిర్మాణాలు కనిపిస్తున్నాయి. ఊరినిండా ఆసరా పింఛన్లు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ఒంటరి మహిళ, వృద్ధాప్య పింఛన్లు ఇట్లా ఏదో ఒక పథకం లేని ఇల్లు లేదంటే అతిశయోక్తి కాదు. రైతులకు రైతుబంధు, రైతు బీమా, ఎరువులు, విత్తనాలు, చెరువుల నిండా నీళ్లు, ప్రాజెక్టులు, 24 గంటల విద్యుత్తు, ధాన్యం కొనుగోళ్లతో ప్రతి రైతుకు కేసీఆర్ వెన్నెముక అయ్యారు.

ఒక్క మాటలో కేసీఆర్ పాలన గురించి చెప్పాలంటే, నాటి శ్రీరాముడి పాలనను తలపిస్తున్నది. ఇలాంటి వ్యక్తిని ప్రజల బాగు కోసం, తెలంగాణ అభివృద్ధి కోసం మరోసారి ఎన్నుకోవలసిన బాధ్యత తెలంగాణ ప్రజల మీద ఉన్నది.

తాళ్లపల్లి సురేందర్ గౌడ్
98497 99893

ప్రసంగాలే విజయ సోపానాలు

ఇప్పటిదాక దేశంలో అన్ని పార్టీల నాయకులు ఎన్నికల సమయంలో తమను గెలిపించమని ప్రజల దగ్గరికెళ్తారు. ప్రజలకు తమలో ఉన్న గుణగణాలను చెప్పటం కన్నా ప్రత్యర్థులపై ఆరోపణలు, నిందలు వేయటం వంటి అంశాలకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు. మరికొన్ని సందర్భాల్లో ప్రత్యర్థులను గిల్లి.. గిచ్చి.. రెచ్చగొట్టి తద్వారా నాలుగు ఓట్లు రాబట్టుకోవాలని చూస్తారు. వ్యక్తిగత నిందలు, వ్యక్తిత్వ విమర్శలకే అధిక ప్రాధాన్యం ఇస్తూ ప్రసంగాలు చేస్తుంటారు. అదే రాజకీయమని సిద్ధాంతీకరించారు కూడా.

ఎన్నికలంటే పరస్పరం దూషించుకోవడం, బట్ట కాల్చి మీదేయటం అనుకొని రెచ్చిపోతుంటారు. కానీ, తెలంగాణలో అందుకు భిన్నమైన వాతావరణం బీఆర్ఎస్ రూపంలో ప్రత్యేకించి కేసీఆర్ తీరుతో ఒక కొత్త అధ్యాయానికి తెరదీసిందని చెప్పాలి.

2014 నుంచి ఇప్పటిదాక జరిగిన రెండు సాధారణ ఎన్నికలు, ఆ మధ్య కాలంలో వచ్చిన ఉప ఎన్నికల సందర్భంలో కేసీఆర్ చేసిన ప్రసంగాలు ఒక సరికొత్త రాజకీయ పరిణతికి బాటలు వేశాయి. బాధ్యతాయుతమైన స్థానంలో ఉన్న వ్యక్తి బాధ్యతారాహిత్యంగా ప్రవర్తిస్తే లేదా ప్రసంగిస్తే వాటి పర్యవసానాలెలా ఉంటాయో తెలిసిన నాయకుడిగా పరిపక్వ రాజకీయ ప్రసంగాలు చేస్తూ తెలంగాణ ప్రజలను తన విద్యార్థులుగా తలచి, వారిని సన్మార్గంలో నడిపించే ప్రయత్నంలో భాగంగా ఆయన అడుగులు వేస్తున్నారు.

2014 ఎన్నికల్లో తెలంగాణ తెచ్చిన పార్టీగా అధికారంలోకి వచ్చి తెలంగాణ ఎలా మారుతుందో బాధ్యతగా చెప్పి ప్రజలను ఒప్పించి మెప్పించగలిగారు కేసీఆర్. 2018 ఎన్నికల్లో తెచ్చుకున్న తెలంగాణను కాపాడే ప్రయత్నంలో, సంక్షేమాభివృద్ధి పథకాలకు అంకురార్పణ చేసి వాటి ఫలితాల ఆవశ్యకతను చెప్పి మరీ ఓటర్ల మదిని గెలిచారు. ఇప్పుడూ అంతే బాధ్యతతో రెండుసార్లు అధికారంలో ఉన్న పార్టీగా, దేశంలో ఎక్కడాలేని సంక్షేమ రాజ్యం తీసుకొచ్చిన ప్రభుత్వంగా మరోసారి ప్రజల మనసులు గెలవాలన్న సత్సంకల్పంతో ఎన్నికల్లో పార్టీలు కాకుండా ప్రజలే గెలువాలనీ, ప్రతి ఎన్నికల సభలో కేసీఆర్ ప్రసంగిస్తున్న తీరును జనం స్వాగతిస్తున్నారు.

ఎన్నికల ప్రచార సభల్లో 'తెలంగాణ ఒకప్పుడు ఎట్లున్నది.. ఇప్పుడు ఎలా మారిందో' వివరిస్తున్నారు. స్పష్టమైన విధానంతో, అవగాహనతో ఓటింగ్ జరిగినప్పుడే ప్రజలు గెలుస్తారని, ప్రజల కోరికలు నెరవేరుతాయని చెప్తున్నారు. 'ఎన్నికలు చాలా వస్తయి, చాలా పోతయి, ఎవరో ఒకరు గెలుస్తుంటరు. ఎన్నికలు రాంగనే ఆగమాగం కావొద్దు. రాయేందో.. రత్నమేందో ఆలోచించాలె. మనకు పనికొచ్చేదేందో గుర్తువట్టాలె' అని చెప్పుకొస్తున్నారు. ఎవరో చెప్పారని ఓట్లు వేయొద్దని, ఓటు మన తలరాతను మారుస్తుందని పేర్కొంటున్నారు. పదేండ్ల కేసీఆర్ పాలనలో రైతుకు తెల్లందాక కరెంటు పెట్టబోయే బాధ లేదు. ఇప్పుడు కంటి నిండా నిద్ర.. కడుపు నిండా కరెంటు .. కల్లాల నిండా వడ్లు. ఏ గ్రామంలో చూసినా, ఏ తారు రోడ్డులో చూసినా ధాన్యపు రాశులు. ప్రతి ఊరిలో వైకుంఠధామాలు, ప్రకృతివనాలు, కొత్త పంచాయతీ భవంతులు, సరికొత్త గుడులు, బడులు ఇలా చెప్పుకుంటూ పోతే పల్లే హాయిగా నిద్రపోయే పరిస్థితి. అందుకే 'మాకు తెలిసిన తెలంగాణ అట్లున్నది... కానీ, ఇప్పుడు తెలంగాణ ఇట్లున్నదని' కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలను వల్లె వేస్తూ ఆ తరం ఈ తరంతో చర్చ పెడుతున్నది. గతంలో పింఛన్ రూ.200 ఇచ్చారని కేసీఆర్ ప్రతి సభలో గుర్తుచేస్తున్నారు. ఎందుకు పింఛన్ ఇవ్వాలి?. ఎందుకు ఆ పింఛన్‌ను పెంచాల్సి వచ్చిందోనని విడమరిచి చెప్తున్న తీరుపై వయో వృద్ధులు కచ్చీర్లలో చర్చలు పెడుతున్నారు. తడారిన నేలకు కాళేశ్వరం నీళ్లు, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మీ, కేసీఆర్ కిట్‌తో పాటు ప్రతి ఇంట్లో ఏదో ఒక పథకానికి లబ్ధిదారుడుంటారు. అయితే, కొన్ని రాజకీయ పార్టీలు యువతను రెచ్చగొట్టినా, ప్రలోభాలకు గురిచేసినప్పటికీ ప్రజా విజయాలు-ప్రభుత్వ ఫలాల రూపంలో కండ్ల ముందే కనపడుతున్నాయి.

వ్యవసాయ మార్కెట్లు ఆధునికీకరించటంతో పాటు గ్రామగామాన రైతు వేదికలు, ధరణితో భూ హక్కుల కల్పన, వృద్ధులకు, ఒంటరి మహిళలకు, గీత కార్మికులకు, బోదకాలు, కిడ్నీ బాధితులకు, వికలాంగులకు ఆసరా పింఛన్లు ఇచ్చి వారిలో ఆత్మస్థైర్యం నింపటం, పూజారులు, ఇమామ్‌లు, మౌజంలకు గౌరవ వేతనాలివ్వటం, ఉమ్మడి పాలనలో శంకుస్థాపనలకే పరిమితమైన ప్రాజెక్టులను పూర్తిచేయడం, చేప పిల్లల ఉచిత పంపిణీ, గొల్ల కుర్మలకు గొర్లను పంచి వారి జీవితాల్లో ఆనందాలు పంచడం వంటివాటిపై ఆయా సామాజికవర్గాల్లో చర్చ జరుగుతుండటం ముదావహం. అలాగే అన్ని జిల్లాల్లో కలెక్టరేట్ కార్యాలయాలు, పోలీస్ కమిషనరేట్ కార్యాలయాలు నిర్మించి పాలనా వ్యవస్థను గ్రామీణ ప్రజలకు చేరువ చేసిన తీరుపై జనంలో చర్చ జరుగుతున్నది. వైద్యారోగ్యంలో విప్లవాత్మక మార్పులు, 33 జిల్లాలకు మెడికల్ కాలేజీలు, బస్తీ, గ్రామీణ దవాఖానలతో పాటు రూపురేఖలు మారిన హైదరాబాద్, కొత్త ఫ్లై ఓవర్లు, కొత్త సచివాలయం, అంబేద్కర్ విగ్రహం, ఐటీ వృద్ధిపై సానుకూల చర్చ జరుగుతున్నది. ప్రజలు గెలువటమంటేనే ఇలాంటివన్న దృక్పథం ప్రతి పల్లెలో కనిపిస్తున్నది. ప్రజలు గెలిచిన తీరు, గెలువాల్సిన ఆవశ్యకతపై కేసీఆర్ తన నాలుగు కోట్ల మందిని జాగృతం చేయటంలో సఫలీకృతులయ్యారనే చెప్పాలి.

వెంకట్ గుంటిపల్లి
94949 41001

తెలంగాణ ప్రగతి దేశానికే దిక్సూచి

ఒక రాష్ట్రంలో అన్ని రంగాలకు ప్రాధాన్యం ఇవ్వడం ప్రభుత్వాలకు సాధ్యం కాదనేది గత ప్రభుత్వాల పాలనతో మనకు తెలుస్తున్నది. అయితే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత కేసీఆర్ నాయకత్వంలో ఏర్పడిన బీఆర్ఎస్ ప్రభుత్వం అన్నిరంగాలకు సమపాళ్లలో నిధుల కేటాయింపు, పథకాల రూపకల్పన చేసింది.

సీఎం కేసీఆర్.. ఒక పోరాటంలా పథకాల అమలును సాగించారు. కీలక రంగాలైన వ్యవసాయం, విద్యుత్తు, సాగు నీరు, విద్య, వైద్యం, సంక్షేమం తదితర ఆరు రంగాలలో ఊహించని మార్పులు తీసుకువచ్చి తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలిపారు.

నాడు బీడు భూములు, నేడు పచ్చని భూములు, నాడు కరెంటు కోతలు, నేడు నిరంతర వెలుగులు, నాడు క్షామం, నేడు క్షేమం. ఇదీ తెలంగాణ సాధించిన విజయం. ఒకప్పుడు వ్యవసాయం దండుగన్న చోటే, నేడు పండుగలా మారింది. 24 గంటల ఉచిత విద్యుత్తు మొదలుకొని.. కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ కాకతీయ, రైతు వేదికలు, రైతుబంధు, రైతుబీమా పథకాలతో రైతులకు అండగా నిలిచారు. వారి ప్రతి అడుగులో తోడయ్యారు. ఫలితంగా వ్యవసాయరంగంలో దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నది తెలంగాణ. సాగు విస్తీర్ణం అమాంతం రెట్టింపైంది. 2014-15లో యాసంగి, వానకాలం కలిపి 1.31 కోట్ల ఎకరాలుగా ఉన్న సాగు విస్తీర్ణం, 2022-23లో 2.09 కోట్ల ఎకరాలకు పెరిగింది.

ఉమ్మడి రాష్ట్రంలో కరువు, పేదరికంతో అల్లాడిన తెలంగాణ రైతన్నకు కేసీఆర్ కొండంత అండగా నిలిచారు. అందుకోసం రైతుబంధు పథకాన్ని తీసుకొచ్చి ఏటా ఎకరాకు రూ.10 వేలు చొప్పున సాయం అందిస్తున్నారు. రైతు బీమా పథకం ద్వారా రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా అందిస్తున్నారు. ఈ ప్రీమియాన్ని ప్రభుత్వమే భరిస్తున్నది. ఒకప్పుడు ధాన్యం కొనుగోళ్లలో 14వ స్థానంలో ఉన్న రాష్ట్రం ఇప్పుడు రెండో స్థానానికి చేరింది. సాగునీటి రంగంలో తెలంగాణ సాధించిన ప్రగతి చరిత్రలోనే ఒక రికార్డు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత కాళేశ్వరం, చనాఖా కొరాటా బరాజ్, సమ్మక్కసారక్క బరాజ్, భక్తరామదాసు,

తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకాలను బీఆర్ఎస్ ప్రభుత్వం మొదలు పెట్టి పూర్తిచేసి రైతుల సాగునీటి గోసను తీర్చింది. పెండింగులో ఉన్న కల్వకుర్తి, రాజీవ్ భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, మిడ్ మానేరు, సింగూర్ కెనాల్స్, ఎల్లంపల్లి, కిన్నెరసాని, పాలెంవాగు, కుమ్రంభీం, మత్తడివాగు, నీల్వాయి, జగన్నాథపూర్ ప్రాజెక్టులను ఏడేండ్లలోనే పూర్తి చేసింది. మిషన్ కాకతీయ ద్వారా నాలుగు దశల్లో సుమారు 48 వేల చెరువులకు జీవం పోసింది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపై ప్రపంచ వ్యాప్తంగా ప్రశంసలందుకున్నది తెలంగాణ ప్రభుత్వం.

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఆరు నెలల్లోనే గృహ, వాణిజ్య, పారిశ్రామికరంగాలకు 24 గంటల నిరంతరాయ విద్యుత్తును అందించి దేశమే ఆశ్చర్యపోయేలా చేసింది తెలంగాణ. రాష్ట్రం ఏర్పడేనాటికి రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోనూ విద్యుత్తు కోతలుండేవి. ఇక పరిశ్రమలకు వారానికి రెండు రోజులు పవర్ హాలిడేలు. వ్యవసాయరంగంలో పేరుకే 6 గంటలు.. కానీ పగలు రెండు, మూడు విడతల్లో 3 గంటలు.. రాత్రిపూట రెండు, మూడు విడతల్లో 3 గంటల పాటు విద్యుత్తును ఇచ్చేవారు. కానీ నేడు యావత్తు దేశం ఆశ్చర్యపడేలా 2018 జనవరి 1 నుంచి వ్యవసాయానికి 24 గంటలపాటు నిరంతరాయంగా, నాణ్యమైన పూర్తి ఉచిత విద్యుత్తును సరఫరా చేస్తున్న రాష్ట్రం ఒక్క తెలంగాణనే. వైద్యరంగంలో అనేక విప్లవాత్మక మార్పులకు తెలంగాణ మనకు సాక్ష్యంగా కనపడుతుంది. కేసీఆర్ కిట్, అమ్మ ఒడి వాహనాలు, కేసీఆర్ న్యూట్రిషన్ కిట్, ఎన్సీడీ కిట్, తెలంగాణ డయాగ్నోస్టిక్స్, రోగి సహాయకులకు భోజనం, బస్తీ దవాఖానలు, పీహెచ్‌సీల్లో లైవ్ కెమెరాలు, టిఫా స్కానింగ్, టీమ్ బేస్డ్ ఇన్సెంటివ్, డైట్, శానిటేషన్ చార్జీలు డబుల్, టెలీ కన్సల్టెన్సీ, టెలి మానస్ సేవలు, ఎక్విప్‌మెంట్ మెయింటెనెన్స్ పాలసీ, కంటివెలుగు వంటి అనేక పథకాలను అమలుచేస్తున్నది. తెలంగాణ ఏర్పడేనాటికి ఐదు ప్రభుత్వ మెడికల్ కాలేజీలు మాత్రమే ఉంటే కొత్తగా 26 మెడికల్ కాలేజీలను సీఎం కేసీఆర్ ఏర్పాటు చేశారు.

విద్యారంగంలో తెలంగాణ దేశానికే తలమానికంగా నిలిచింది. సీఎం కేసీఆర్ ఆలోచనల నుంచి వచ్చిన గురుకులాల ఏర్పాటుతో పాటు మధ్యాహ్న భోజనం, మన ఊరు-మన బడి, ఉచితంగా బ్రేక్ ఫాస్ట్, విదేశీ ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం, హాస్టళ్లలో సన్నబియ్యం పథకం, ఇంగ్లిష్ మీడియం చదువులను ప్రారంభించి విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తున్నది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడేనాటికి కేవలం 293 గురుకుల పాఠశాలలు ఉండగా నేడు 1,005 గురుకులాల్లో 5 లక్షలకుపైగా విద్యార్థులకు అధునాతన సౌకర్యాలతో నాణ్యమైన ఉచిత విద్యాబోధనతో పాటు భోజన, వసతి సదుపాయాలు కల్పిస్తున్నది.

సంక్షేమరంగంలో ఆసరా పింఛన్లు, ఒంటరి మహిళ, దివ్యాంగులకు పింఛన్లు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, గొర్రెలు, చేపల పంపిణీ, దళితబంధు, బీసీ, మైనారిటీలకు లక్ష సాయం, గృహలక్ష్మి, పోడు భూములకు పట్టాలు, బీసీ కులాలకు ఆత్మగౌరవ భవనాలకు స్థలాలను కేటాయించి, భవన నిర్మాణానికి రూ. కోటి చొప్పున అందించింది. తొమ్మిదేండ్ల పాలనలో తెలంగాణ అనేక అద్భుతాలు, విజయాలను సాధించింది. ఈ విజయాలు భవిష్యత్తులో కూడా కొనసాగాలంటే బీఆర్ఎస్‌ను భారీ మెజారిటీతో గెలిపించి కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత మనందరిదీ.



కల్లూరి రామచంద్రారెడ్డి
90524 66668

ప్రజాస్వామ్య పరిణతి కోసం

తెలంగాణ రాష్ట్ర శాసనసభ ఎన్నికల ప్రచారం ఆసక్తికరంగా, కొంత విస్మయం కలిగించేలా సాగుతున్నది. బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ తన ప్రసంగాలలో పార్లమెంటరీ ప్రజాస్వామ్య పరిణతి, ప్రజాస్వామ్యంలో ప్రజల గెలుపు, పార్టీల పనితీరు, అభ్యర్థి, పార్టీల తీరుతెన్నులు, మ్యానిఫెస్టోల గురించి ప్రజలకు అవగాహన కలిగిస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే జరిగే పరిణామాలను కూడా వివరిస్తున్నారు. ఇక ప్రజలే ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని తేల్చిచెప్తున్నారు.



తొమ్మిదేండ్లు అధికారంలో ఉన్న కేసీఆర్ ఎన్నికల ప్రచారంలో ప్రజాస్వామ్య పరిరక్షణ, పార్లమెంటరీ వ్యవస్థ పరిణతి గురించి పదేపదే చెప్పటం ప్రస్తుత పరిస్థితిలో అనివార్యం. సిద్ధాంతాలకు తిలోదకాలిచ్చి సీట్ల గెలుపే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్న రెండు జాతీయపార్టీల వైఖరిని ప్రజలముందు ఉంచుతూ పార్లమెంటరీ ప్రజాస్వామ్యం విశిష్టతను ప్రజల్లో చర్చకు పెడుతూ సాగుతున్న కేసీఆర్ ప్రచారం పూర్తి భిన్నంగా ఉన్నది.

మరోవైపు తమదే అధికారం, ఎన్నికలవడమే ఆలస్యం ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారానికి సిద్ధం అన్నట్టు కాంగ్రెస్ ప్రచారం తిట్లు, బూతులతో సాగుతున్నది. ఎన్నికల్లో ఎదుటివారిపై విమర్శలు సాధారణమే కానీ, ఆ విమర్శలు శృతిమించి వ్యక్తిగత దూషణలకు దారితీశాయి. కామారెడ్డి సభలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మాట్లాడిన తీరు అత్యంత జుగుప్సాకరంగా ఉన్నది. ఇక్కడ మాత్రమే కాదు దాదాపు అన్ని ప్రచార సభల్లో ఇంచుమించు ఇలాగే కొనసాగడం గమనార్హం. అంతేకాదు, కనీస మానవత్వాన్ని మరిచి దుబ్బాక ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై జరిగిన కత్తి దాడిని కూడా చాలా హేళన చేసిన తీరును ప్రజలు తప్పుపడుతున్నారు. కేవలం ప్రచారంలోనే కాకుండా ఎన్నికల కోసం రూపొందించిన ప్రకటనలు సైతం వారి ప్రచారశైలికి ఏ మాత్రం తీసిపోని రీతిలో ఉన్నాయి. ఇక బీజేపీ విషయానికి వస్తే కర్ణాటక ఫలితాల అనంతరం తమ రెగ్యులర్ ఫార్ములాను ఈ ఎన్నికల్లో పక్కనపెట్టినట్టు కనబడుతున్నది. పూర్తిగా బహుజన వాదం ఎత్తుకున్నట్టు కనబడేలా చూసుకుంటున్నది. బీసీ ముఖ్యమంత్రి ప్రకటన, ఎస్సీ వర్గీకరణ చుట్టే వారి ప్రచారం తిరుగుతున్నది. అయితే ఈ మార్పు శాశ్వతమా? లేక తాత్కాలికమా కాలమే చెప్తుంది. ఈ ఎన్నికల్లో ఒక మంచి ముందడుగు బీఆర్ఎస్ నుంచి పడింది. అదే పాజిటివ్ క్యాంపైన్. తాము చేసింది, చేయవలసింది చెప్పటం, తమ విజన్‌ను ప్రజల ముందు ఉంచడం. అసంతృప్త వర్గాలను కన్విన్స్ చేయడం, తద్వారా వారిని మెప్పించడం మంచి సంప్రదాయంగా కనబడుతోంది. బహిరంగ సభలతో కేసీఆర్ దూసుకుపోతుంటే మరోవైపు కేటీఆర్, హరీశ్‌రావులు మీడియా, సోషల్‌మీడియా, రోడ్ షోలలో తమదైన పాజిటివ్ శైలిలో దూసుకుపోతున్నారు.

ఇటీవల కేటీఆర్ ఎంగేజ్ చేసిన రేడియో మిర్చి, మై విలేజ్ షో, అన్ ఫిల్టర్డ్ విత్ సాండిష్, మారథాన్ ఇంటర్వ్యూలు, పార్ట్‌నర్స్ ఇన్ డెవలప్‌మెంట్ పేరిట జరిగిన వివిధ సమ్మేళనాలన్నీ సంప్రదాయ ఎన్నికల ప్రచారానికి భిన్నమైనవి. కేసీఆర్ తన ప్రసంగాల్లో చెప్తున్నట్టు ప్రజాస్వామ్య పరిణతి కోసం ఈ విధంగా సుహృద్భావ వాతావరణంలో ప్రచారానికి ఒక ముందడుగు పడటం అభినందనీయం.

పాశం రఘునందన్ రెడ్డి
72077 70469